నేటి నుంచి మహా జాతర

నేడు సారలమ్మ, రేపు సమ్మక్క రాక

- కిటకిటలాడనున్న జాతర ప్రాంగణాలు

కరీంనగర్ కల్చరల్ , ఫిబ్రవరి 20: సమ్మక్క, సారలమ్మలు వనం వీడి జనారణ్యంలోకి వచ్చి గద్దెలపై కొలువుదీరనున్నారు. సమ్మక్క, సారలమ్మ జాతర ఉత్సవాలు బుధవారం నుంచి ఆరంభం కానున్నాయి. అదే రోజు సమ్మక్క కూతురైన సారలమ్మ సాయంత్రం నాలుగు గంటలకు కొలువుదీరనుంది. గురువారం సమ్మక్క గద్దెపైకి రానుంది. శుక్రవారం ఇద్దరు తల్లులు భక్తులకు దర్శనమిస్తారు. ఈ రోజు భక్తులు పెద్ద ఎత్తున మొక్కులు చెల్లించుకుంటారు. శనివారం సాయంత్రం దేవతలు వన ప్రవేశం చేయడంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయి. ఈ జాతర మేడారానికే పరిమితం కాకుండా ఆయా ప్రాంతాల్లో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో. ఉమ్మడి జిల్లాలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో 32 ప్రాంతాల్లో జాతరకు ఏర్పాట్లు చేశారు.

జాతరకు అన్ని ఏర్పాట్లు చేశాం...

- చంద్రశేఖర్, ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్

ఉమ్మడి జిల్లాలో అధికారికంగా 32 చోట్ల జరగనున్న సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాలను అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. సుమారు 15 లక్షల వరకు భక్తులు హాజరకానున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



రేకుర్తి జాతరకు ముస్తాబైన సమ్మక్క, సారలమ్మ గద్దెలు

ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు, షామియానాలు

మేడారం వెళ్తున్న భక్తులు

ముల్లె మూటలు... పిల్లా పాపలతో...

మేడారానికి బయలుదేరిన భక్తులు

భగత్‌నగర్: తెలంగాణ కుంభమేళాకు వేళయ్యింది. ముల్లె మూటలు... పిల్లా పాపలతో.... అడవి తల్లుల దర్శనానికి అమ్మల చెంతకు భక్తులు పయనమవుతున్నారు. కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో మంగళవారం మేడారం తరలి వెళ్లేందుకు భక్తులు సిద్ధమయ్యారు. ఆర్టీసీ బస్టాండ్ సమ్మక్క భక్తులతో కిక్కిరిసి పోయిది. రెండు సంవత్సరాల కోసారి వచ్చేవన జాతరకు భక్తులు అన్ని సిద్ధం చేసుకుని బస్టాండ్‌కుతరలి వెళుతున్నారు.

- **నెత్తిన బంగారు... చేతిలో మొక్కులు**

మేడారం సమ్మక్క జాతరకు భక్తులు నెత్తిన బంగారం (బెల్లం)తో, చేతిలో తాము మొక్కుకున్న మొక్కులను పట్టుకుని ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకున్నారు. వంట సామాగ్రితో పాటు, మొక్కులు సమర్పించేందుకు గొర్రెలు, మేకలు, కోళ్ల చేతిలో పట్టుకుని కుటుంబ సభ్యులంతా బస్సుల కోసం వేచి చూశారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేడారం వెళ్లే భక్తులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. 750 సర్వీసులు, 3 వేల మంది సిబ్బందిని నియమించింది. రద్దీని బట్టి మరో 100 బస్సులు అదనంగా నడపడానికి ఏర్పాట్లు చేసింది. కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు, వైద్య సేవలు, వివిధ డిపోల నుంచి వచ్చే సిబ్బందికి వసతి, భోజన ఏర్పాట్లను చేసింది. మేడారం సమ్మక్క జాతరకు ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. మహిళలు ఆధార్‌కార్డు తప్పనిసరిగా చూపించాలని అధికారులు కోరుతున్నారు.

ప్రభుత్వ కళాశాలకు మంచి పేరు తేవాలి

- **కలెక్టర్ పమేలా సత్పతి**

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20: అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ కళాశాలకు విద్యార్థులు మంచిపేరు తేవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం కరీంనగర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లా డుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ కష్టపడి చదువుకోవాలని సూచిం చారు. క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు కలెక్టర్ బహుమతులను అందజేశారు. మెరిట్ విద్యార్థులకు మలబార్ గోల్డ్ డైమండ్స్ కంపెనీ తరఫున స్కాలర్‌షిప్‌లను కలెక్టర్ అందించారు. కార్యక్రమంలో డీఐఈవో జగన్మోహన్‌రెడ్డి, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె రవీందర్‌రెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సత్యవర్ధన్‌రావు పాల్గొన్నారు.

- **బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి**

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో విజిలెన్స్, ఎస్సీఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పోలీసు అధికారులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో నెలలో ఒక రోజు సివిల్ రైట్స్ డే నిర్వహించాలని సూచించారు. సీపీ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ అట్రాసిటీ కేసులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు విచారణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో మహేశ్వర్, సోషల్ వెల్ఫేర్ డీడీ నతానియల్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆంజనేయులు, మేడి మహేశ్, రవి నాయక్, నర్సింగ్,బాబు, టౌన్ ఏసీపీ నరేందర్, రూరల్ ఏసీపీ వెంకటరమణ, హుజురాబాద్ ఏసీపీ శ్రీనివాస్, డీసీఆర్‌బీ ఎస్ఐ నరేశ్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

- **వైభవంగా మహాపూర్ణాహుతి... వసంతోత్సవం.. చక్రస్నానం**
- **నేడు శ్రీవారి శోభాయాత్ర...**

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 20: జిల్లా కేంద్రంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. ఉదయం మహాపూర్ణాహుతి, చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం నేత్రపర్వంగా శ్రీపుష్పయాగం, ద్వాదశారాధన, సప్తావరణాలు, ధ్వజావరోహణ, ఏకాంతసేవ నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, కుటుంబసభ్యులు, వ్యవస్థాపక వంశపారంపర్య ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాదర్, ఈఓ ఉడుతల వెంకన్న, అర్చకులు లక్ష్మీనారాయణాచార్యులు, నాగరాజాచార్యులు, ఎసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ పురుమల్ల శ్రీనివాస్, నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కటకం వెంకటరమణ, నార్ల కార్తీక్, వేదపండితులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.


ఉత్సవ మూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు


పూర్ణాహుతిలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

నేటి శోభాయాత్రలో పాల్గొనండి

- మంత్రి పొన్నం ప్రభాకర్

అందరి సహకారంతో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించాము. వేద పండితులు, అర్చకులు, ఈవో, సిబ్బంది, దాతలు, సేవకులు, పలు సంస్థల బాధ్యులు విజయవంతానికి కృషి చేశారు. వారందరికి కృతజ్ఞతలు. బుధవారం సాయంత్రం ఐదు గంటల నుంచి మార్క్‌ఫెడ్ గ్రౌండ్ నుంచి జరిగే శ్రీవారి శోభాయాత్రలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలి.

కన్నుల పండువగా మత్స్యగిరీంద్రుడి కల్యాణం


శంకరపట్నం మండలం కొత్తగట్టులో శ్రీమత్స్యగిరీంద్రస్వామి కల్యాణం

శంకరపట్నం, ఫిబ్రవరి 20: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి కల్యాణం మంగళ వారం కన్నుల పండువగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని వీక్షిం చారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనా రాయణ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారి కల్యా ణంలో పాల్గొన్నారు. అంతకు ముందు ధ్వజారోహణ, గరుడ బలి, ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన పద్మశాలి వంశీయులు వధువుల తరుపున ఎదుర్కోళ్ల క్రతువు నిర్వహించారు. వరుడి తరుపున కొత్తగట్టు గ్రామస్థులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు.చిగు రాల రామకృష్ణాచార్యులు ఆధ్వ ర్యంలో శేషం మురళీ ధరా చార్యులు, మాధవా చార్య లు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. స్వామివారి కల్యాణం వీక్షించడానికి వచ్చిన భక్తులు పట్టు వస్త్రాలు, తలం బ్రాలు, కట్న కానుకలు స్వామి వారికి సమర్పించి మొక్కలు చెల్లించారు.దేవాలయ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కేశవపట్నం ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

డీడీలు కట్టిన గొల్ల కురుమలకు నగదు బదిలీ చేయాలి

భగత్‌నగర్, ఫిబ్రవరి 20: సబ్సిడీ గొర్రెల కోసం డీడీలు కట్టిన గొల్లకురుమలకు నగదు బదిలీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకం వృత్తి దారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్ అన్నారు. మంగళవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ సమావేశాల్లో ఈ విషయాన్ని చర్చించిన శాసన సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, కాల్వ శ్రీనివాస్, సందనవేణి ప్రసాద్, కొమురయ్య, గోపాల సంపత్, రాదారపు కుమార్, గుండవేణ ప్రవీణ్‌కుమార్, పవన్‌యాదవ్ పాల్గొన్నారు.



బుగ్గయిన బడుగుల గూడు

- కరీంనగర్‌లో భారీ అగ్నిప్రమాదం
- 21 పూరి గుడిసెలు దగ్ధం
- కాలిపోయిన బంగారం, వెండి, నగదు, సామగ్రి

> మంగళవారం ఉదయం 10 గంటలు.. కరీంనగర్‌లోని ఆదర్శనగర్‌లో ఒక్కసారిగా కలకలం.. కాలనీ మధ్యలో ఉన్న గుడిసెల్లో మంటలు చెలరేగాయి. చూస్తుండగానే ఉగ్ర రూపం దాల్చాయి. 21 గుడిసెలు కాలిబూడిదయ్యాయి.. ఈ గుడిసెల్లో నివాసం ఉండే వారు మంగళవారం ఉదయం మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వెళ్లడంతో భారీ ప్రాణనష్టం తప్పింది.

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 20: కరీంనగర్ ఆదర్శనగర్‌లో మంగళవారం ఉదయం భారీ అగ్నిప్రమాదం జరిగింది. మంచిర్యాల చౌరస్తా సమీపంలోని ఆదర్శనగర్‌లో కూలీలకు చెందిన 21 పూరి గుడిసెలు మంటల్లో దగ్ధమయ్యాయి. ఈ గుడిసెలన్నీ మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలకు చెందిన ఒడ్డెర కూలీలు నివాసం ఉంటున్నారు. గుడిసెల వాసులందరూ మంగళవారం ఉదయమే మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లారు. ఉదయం 10 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు అంటుకుని గుడిసెల్లోని గ్యాస్ సిలండర్లు పేలాయి. చుట్టుపక్కల ఇళ్లల్లోని ప్రజలు భయాందోళనలతో బయటకు వచ్చారు. ఈ పేలుడు ధాటికి పక్కనే ఉన్న ఒక ప్రైవేట్ ఆసుపత్రిలోని ఇద్దరు సిబ్బందికి గాయాలయ్యాయి. గుడిసెల్లోని కూలీలు ఉదయం తొమ్మిది గంటలకు దీపం పెట్టి జాతరకు వెళ్లగా ఆ దీపంతో మంటలు అంటుకుని ఉండవచ్చని, షార్ట్‌సర్క్యూట్‌తో కూడా ప్రమాద జరిగే అవకాశం ఉందని అగ్నిమాపక అధికారులు అంటున్నారు.

- **తప్పిన ప్రాణనష్టం**

ఆదర్శనగర్‌లో 120 వరకు వడ్డెర కార్మికులు ఒక ప్రైవేట్ స్థలంలో 36 గుడిసెలు వేసుకుని భార్యా, పిల్లలతో నివాసం ఉంటూ కూలీ పనులు చేసుకుటూ జీవనం గడుపుతున్నారు. వారం రోజుల క్రితం కొందరు, మంగళవారం మరో రెండు కుటుంబాలు ఆటోలో మేడారం జాతరకు వెళ్లారు. ప్రమాదం జరిగిన సమయంలో గుడిసెల్లో ఎవరూ లేక పోవడంతో ప్రాణ నష్టం తప్పింది. ఈ గుడిసెల్లోనే చల్ల లక్ష్మి అనే కూలీ అనారోగ్యంతో మేడారం జాతరకు వెళ్ళలేకపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో ఆమె బయటకు వస్తుండగా ఆమె వీపునకు మంటలు అంటుకుని గాయాలయ్యాయి. మంగళవారం బత్తుల రాంబాబు, బత్తుల కృష్ణ కుటుంబాలు ఆటోలో మంగళవారం ఉదయం 9:30 గంటలకు మేడారం జాతరకు బయలుదేరి వెళ్లి హుజురాబాద్ ప్రాంతానికి చేరుకోగానే అగ్నిప్రమాదం జరిగిన విషయం తెలుసుకుని వెనక్కి వచ్చేశారు. అగ్నిప్రమాదం సమాచారంతో కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్, జిల్లా ఫైర్ ఆఫీసర్ టి వెంకన్నలు హుటాహుటిన ఫైరింజన్లతో సంఘటనా స్థలానికి చేరుకుని మూడు గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మూడో టౌన్ సీఐ వి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు సహాయక, భద్రతా చర్యలు చేపట్టారు. బత్తుల రాంబాబు, చల్ల తిరుమలయ్య, చల్ల రమేష్, గుంజ రమేష్, బత్తుల కృష్ణ, కుంచం తిరుమలేష్, వేముల రాములు, వేముల నాగరాజు, వేముల ఎల్లయ్య, ఆలకుంట నర్సయ్య, చల్ల వెంకటేష్, బత్తుల రాంప్రసాద్, గోగుల యాదయ్య, కుంచపు శివ, వేముల శ్రీను, ఒర్సు శ్రీను, వేముల ఉప్పలయ్య, గుర్రం కుమార్, మక్కల్ల శ్రీను, బత్తుల వెంకన్న, ఒర్సు కృష్ణకు చెందిన గుడిసెలు ప్రమాదంలో దగ్ధమయ్యాయి.

- **జిలెటిన్ స్టిక్స్‌తోనా..?**

ఒడ్డెర కార్మికులు బావులు, మట్టి, బండ తవ్వకాల పనులు చేస్తుంటారు. ఈ పనుల సందర్భంగా జిలెటిన్ స్టిక్స్ వినియోగిస్తుంటారు. కొన్ని సందర్భాల్లో మిగిలిపోయిన జిలెటిన్ స్టిక్స్ ఇంటికి తీసుకువచ్చి భద్రపరుస్తుంటారు. ఇంటిలో పెట్టిన జిలెటిన్ స్టిక్స్ ప్రమాదవశాత్తుగా పేలి ఉంటాయని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదంలో ఆరు గ్యాస్ సిలిండర్లు పేలాయని, మరికొన్నింటిని పేలకుండా చర్యలు తీసుకున్నామని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. జిలెటిన్‌స్టిక్స్ పేలాయనే అనుమానాలపై విచారణ జరుపుతామన్నారు. గుడిసెల్లో ఉన్న టీవీ, బీరువా, బంగారం, వెండి, నగదు, డిష్ యాంటెనాలు, వంట సామగ్రి, బియ్యం, బట్టలు, ద్విచక్రవాహనాలు కాలిబూడిదయ్యాయి. ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరిశీలించారు. మేయర్ వై సునీల్‌రావు, కార్పొరేటర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రెనే హాస్పిటల్ చైర్మన్ బంగారి స్వామి, సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కూలీల కుటుంబాలను పరామర్శించారు.

- **వివాదంలోని భూమిలో గుడిసెలు**

అగ్నిప్రమాదం జరిగిన స్థలంపై ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం జరుగుతోంది. ఈ విషయంపై కోర్టులో కేసు నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వివాదంలో భాగంగా గుడిసెలు ఖాళీ చేయించేందుకు ఏదైనా ప్రయత్నంలో భాగంగా అగ్నిప్రమాదం తలపెట్టారా.. అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బాధితులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్



పూరి గుడిసెలు పూర్తిగా కాలిపోవటంతో కూలీలు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారని ప్రభుత్వం ఆర్థికసహాయం అందించి ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కోరారు. ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయల తక్షణ ఆర్థిక సహాయం అందించాలని, ప్రభుత్వం మురికి వాడలపై దృష్టిసారించి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బైక్ కాలిపోయింది...

- బత్తుల రాంబాబు



మేమందరం ఆటోలో మేడారం జాతరకు ఉదయం 9:30 గంటలకు బయలుదేరి వెళ్లాం. హుజూరాబాద్ దాటిన తరువాత మా గుడిసెలు కాలిపోతున్నట్లు ఫోన్ వచ్చింది. వెంటనే అందరం తిరిచి వచ్చాం. అప్పటికే మా గుడిసె పూర్తిగా కాలిబూడిదయింది. నా బైక్ కూడా దగ్ధమైంది. మాది ఖమ్మం జిల్లా గార్ల స్వగ్రామం, 23 ఏళ్ళ నుంచి ఇక్కడే కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నా.

పడుకుని ఉండగా పేలిన శబ్దం వచ్చింది

- చల్ల లక్ష్మి. బాధితురాలు



మాది ఖమ్మం జిల్లా, మావాళ్లందరు మేడారం జాతరకు వెళ్లగా నేను అనారోగ్యంతో ఇక్కడే గుడిసెలో ఉండిపోయాను. మొదట బాంబులు పేలినట్లు పెద్ద శబ్దం వచ్చింది. తరువాత కాలిన వాసన రావటంతో బయటకు వచ్చి చూసే సరికి మా గుడిసె కాలిపోతున్నది. సామాగ్రి కోసం వెదుకుతుండగా వీపు భాగంలో మంటలు అంటుకున్నాం.

కట్టుబట్టలతో రోడ్డున పడ్డాం...

- బత్తుల ఎల్లమ్మ



మాది మహబూబాబాద్. 30 ఏళ్లుగా ఇక్కడే కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాం. మేము ఆటోలో మేడారం వెళుతుండగా మా గుడిసెలు కాలుతున్నట్లు మా బంధువులు ఫోన్‌లో చెప్పారు. వచ్చి చూసేసరికి గుడిసె మొత్తం కాలి బూడిదయింది. కట్టుబట్టలు మినహా ఏమీ మిగలలేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి. కూలిపనులకు సంబంధించిన యంత్రాలు కూడా కాలిపోయాయి.

ఆర్టీసీ ఏర్పాట్లు పరిశీలించిన ఈడీ



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఈడి పివి మునిశేఖర్

భగత్‌నగర్, ఫిబ్రవరి 20: మేడారం జాతరను పురస్కరించుకుని కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ఏర్పాట్లను ఆర్టీసీ ఈడి పివి మునిశేఖర్ మంగళవారం పరిశీలించారు. మేడారం సమ్మక్క క్యాంపులో భక్తులకు ఏర్పాటు చేసిన సదుపాయాలను, అందుబాటులో ఉన్న బస్సులు, భక్తుల రద్దీని పరిశీలించి అధికారులలో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీఆర్ఎం ఎన్‌సుచరిత, డిప్యూటి రీజినల్ మేనేజర్ ఎస్‌భూపతిరెడ్డి, డిపో మేనేజర్‌లు ఎల్‌మల్లేశం, మల్లయ్య ఉన్నారు.

భూ కబ్జా కేసులో బీఆర్ఎస్ నాయకుడి అరెస్టు

- మరో 8 మందిపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 20 : నకిలీ ధ్రువపత్రాలు సృషించి, భూఆక్రమణకు సంబంధించిన కేసులో బీఆర్ఎస్ నాయకుడు నందెల్లి మహిపాల్‌ను మంగళవారం కొత్తపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో నందెల్లి మహిపాల్‌తో సహా చిట్యాల కిష్టమ్మ, గుండ రాజమల్లు, గంగాధర కనకయ్య, నక్క జితెందర్, నక్క పద్మ, తాటిపాముల రాజు, కొత్తకొండ శ్రీను అలియాస్ మైకేల్ శ్రీను, మాజీ కొత్తపల్లి తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌లు నిందితులుగా ఉన్నారు. వీరందరిపై ఐపీసీ సెక్షన్ 467, 468, 471, 420, 386, 506, 120బి రెడ్‌విత్ 34 కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఏ3గా ఉన్న నందెల్లి మహిపాల్‌ను కొత్తపల్లి పోలీసులు ఉదయం అదుపులోకి తీసుకుని సుదీర్ఘ విచారణ అనంతరం సాయంత్రం కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ చేస్తూ జడ్జి ఆదేశాలతో కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. ఈ కేసులో మిగతా 8 మంది నిందితులను కూడా త్వరలో అరెస్టు చేయనున్నట్లు సమాచారం. ఎర్రం కనకారెడ్డి 2008 సంవత్సరంలో సర్వే నెంబరు 776, 777, 778లో 15 గుంటల స్థలాన్ని చిట్యాల కిష్టమ్మ, గంగాధర కనకయ్యతో కలిసి మోసపూర్వకంగా ఎర్రం కనకారెడ్డి అనే వ్యక్తి భూమిని కాజేయాలని నకిలీ సేల్ అగ్రిమెంట్ డీడ్‌ను రాజమల్లు పేరిట సృష్టించినట్లు పోలీసులు తెలిపారు. ఈ నకిలీ సేల్ అగ్రిమెంట్ డీడ్ ఆధారంగా ముందుగా ఎర్రం కనకారెడ్డి పేరిట ఉన్న ఒరిజినల్ అగ్రిమెంట్ డీడ్ ధ్రువపత్రాన్ని వారికున్న అధికార బలంతో రద్దు చేయించినట్లు తెలిపారు. అనంతరం ఆ భూమిని గుండా రాజమల్లు పేరిట రిజిస్ట్రేషన్ చేయించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఆ



నందెల్లి మహిపాల్‌ను కోర్టుకు తీసుకెళ్తున్న రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్

భూమి తదుపరి పక్క జితేందర్, నక్క పద్మలకు విక్రయించారని, వారి నుంచి కొంత భాగం తాటి పాముల రాజుకు, కొత్తకొండ శ్రీను అలియాస్ మైకేల్ శ్రీనుకు విక్రయించే ప్రయత్నం చేశారని తెలిపారు. దీంతో బాధితుడు న్యాయం కోసం కోర్టులో పిటిషన్ వేయగా నందెల్లి మహిపాల్ బాధితుడిని పిలిపించి పిటిషన్ వాపసు తీసుకోవాలని లేదంటే చంపుతానని బెదిరించడమే కాకుండా సమస్య పరిష్కరించేందుకు తనకు 4 గుంటల భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారన్నారు. నిందితులంతా మాజీ తహసీల్దార్ చిల్ల శ్రీనివాస్‌ను కలిసి అతని సహకారంతో కోర్టులో పెండింగ్ ఉన్నప్పటికీ నిందితుల పేరిట మ్యుటేషన్ చేయించినట్లు తెలిపారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20: నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (దన్గర్‌వాడీ)లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎస్‌సీఈఆర్‌టీ తెలంగాణ, డీఈవో అనుమతితో సైన్స్ టాలెంట్ టెస్ట్-24ను నిర్వహించారు. జిల్లా ఫిజికల్ సైన్స్ ఫోరం, బయాలజికల్ సైన్స్ ఫోరం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా సైన్స్ ఆఫీసర్ చాడ జైపాల్‌రెడ్డి అధ్యక్షుడిగా వ్యవహరించగా సెక్టోరియల్ ఆఫీసర్ కర్ర అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ నెల 18న నిర్వహించిన మండలస్థాయి ఆన్‌లైన్ సైన్స్ టాలెంట్ టెస్టులో గెలుపొందిన 44 మంది విద్యార్థులు జిల్లాస్థాయి టెస్ట్‌లో పాల్గొన్నారని, ఇందులో నుండి నలుగురిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు జైపాల్‌రెడ్డి తెలిపారు. మొదటి బహుమతిని ఎస్.నాగలక్ష్మి (టిఎస్ఎంఎస్‌గంగాధర), రెండవ బహుమతి బి.హర్షిని (జడ్పీహెచ్ఎస్ కోరపల్లి), మూడవ బహుమతి బి.నక్షత్ర (జడ్పీపిహెచ్ఎస్, కొత్తపల్లి), యు.శ్రీచక్ర గెలుచుకున్నట్లు ప్రపకటించారు.

ఎల్ఎల్‌బీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్,ఫిబ్రవరి20: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిసెంబర్ 2023లో నిర్వహించిన ఎల్ఎల్‌బీ ఐదవ సెమిస్టర్(రెగ్యులర్, బ్యాక్‌లాగ్)లా ఫలితాలను విడుదల చేసినట్లు మంగళవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ తెలిపారు.యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలన్నారు.

భూకబ్జాను అడ్డుకున్నందుకు దాడి

- కౌన్సిలర్‌పై క్రిమినల్ కేసు నమోదు

జమ్మికుంట, ఫిబ్రవరి 20: ప్రభుత్వ భూమిలో అక్రమంగా బోర్ వేస్తుండగా అడ్డుకున్న మాజీ వార్డు సభ్యుడు, అతని సన్నిహితులపై రాడ్డుతో దాడి చేసిన సంఘటనలో కౌన్సిలర్ మేడిపల్లి రవీందర్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరగంటి రవి మంగళవారం తెలిపారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపల్లిలో కౌన్సిలర్ ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమంగా బోర్ వేస్తున్నాడని తెలుసుకున్న మాజీ వార్డు సభ్యుడు కొలగాని రాజేందర్ తన సన్నిహితులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నాడు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా బోర్ ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. అక్కడే ఉన్న కౌన్సిలర్ ఎన్ని రోజులు నన్ను ఇలా టార్చర్ పెడుతారంటూ ఆగ్రహంతో ఇనుప రాడ్డుతో వారిపై దాడి చేశాడు. పలువురు స్వల్ప గాయాలతో తప్పించుకోగా మేడిపల్లి మల్లయ్య తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. రెండు నెలల క్రితం కబ్జా విషయమై తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయడం వల్లే మనసులో పెట్టుకుని హత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్‌గా ఉన్న రవీందర్ ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు ఆసుపత్రికి చేరుకుని గొడువకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి దాడులు దురదృష్టకరమని, ఇలాంటి సంఘటనలు పుణరావృతం కాకుండా చూడాలన్నారు.

● షోకాజ్ నోటీస్‌లు జారీ

జమ్మికుంట 3వ వార్డు కౌన్సిలర్ మేడిపల్లి రవీందర్‌కు జిల్లా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. అవినీతి అక్రమాలకు ఎవరు పాల్పడినా సహించేది లేదని చెప్పారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 20: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇరువర్గాలు పరస్పరం దాడికి దిగిన సంఘటనలో కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం సోమారిపేట, ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్, అక్కపల్లి గ్రామాలకు చెందిన శివరాత్రి బాలకృష్ణ, అతడి బావ బత్తుల కృష్ణంరాజు, మందాటి శ్రీశైలం, మందాటి అశోక్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ మంగళవారం తెలిపారు. మండలంలోని అక్కపల్లికి చెందిన మందాటి శ్రీశైలం, మందాటి అశోక్ ద్విచక్ర వాహనంపై మండల కేంద్రంలోని రెండో బైపాస్ రోడ్‌పై వెళ్తున్నారు. సోమారిపేటకు చెందిన బాలకృష్ణ, బొప్పాపూర్‌లోని కృష్ణంరాజు, లక్ష్మీ బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. రోడ్డు ప్రమాదానికి కారణమని పేర్కొంటూ ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి.

పంచాయతీ సెక్రెటరీ రిమాండ్

గంభీరావుపేట, ఫిబ్రవరి 20: గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామ పంచాయతీ సెక్రెటరీ మజీద్‌పై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై రాంమోహన్ తెలిపారు. 2022-2023 సంవత్సరంలో గంభీరావుపేట గ్రామ పంచాయతీ సెక్రెటరీగా పనిచేసిన సమయంలో మజీద్ రికార్డులు ఫోర్జరీ చేసినట్లు విజయలక్ష్మణ్ ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఇంటి నంబరు 4-1-100కి అదనంగా ఇంటి నంబరు 4-1-100/1 సృష్టించి రికార్డులను తారుమారు చేశాడన్నారు. రికార్డులు ఫోర్జరీ చేసినందుకు పంచాయతీ సెక్రెటరీ మజీద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ, ఫిబ్రవరి 20 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధంగా ఉన్న బద్దిపోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బద్దిపోచమ్మ అమ్మవారికి బోనం చెల్లించేందుకు భారీ సంఖ్యలో జనం తరలి రావడంతో క్యూ లైన్లు కిక్కిరిసిపోయాయి.

రాజన్న హుండీ ఆదాయం కోటి 77 లక్షలు

వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ఖజానాకు హుండీ రూపంలో ఒక కోటి 77లక్షల పైచిలుకు ఆదాయం సమకూరింది. 13 రోజుల వ్యవధిలో భక్తులు శ్రీ స్వామివారి హుండీలలో సమర్పించిన నగదు, బంగారు, వెండి కానుకలను ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో గట్టి బందోబస్తు మధ్య మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఒక కోటి 77 లక్షల 74 వేల, 752 రూపాయల నగదు, 284 గ్రాముల 253 మిల్లిగ్రాముల బంగారం, 11 కిలోల, 300 గ్రాముల



బోనంతో బారులు తీరిన భక్తులు

వెండి లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ఈఓ డి కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ ఏఈఓలు ఎస్ హరికిషన్, జయకుమారి, బి శ్రీనివాస్, పి నవీన్, ఆలయ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పాటు శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న కార్మికులు జీతాలు చెల్లించాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 20: రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బండారి శేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా ఆసుపత్రి ఎదుట కార్మికులు దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులను కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న రెండు నెలల జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 306 జీవో ప్రకారం కార్మికులకు రూ. 16000జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికలకు సక్రమంగా జీతాలు రావడం లేదని ఆరోపించారు. కరీంనగర్‌లో రెండు నెలలు, హుజురాబాద్‌లో నాలుగు నెలలుగా కార్మికలు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కార్మికులు ఇంటి అద్దె, నిత్యవసర వస్తువులు తెచ్చుకోలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఈ విషయమై కాంట్రాక్టర్‌ను సంప్రదిస్తే 2023 జూలై నుంచి ప్రభుత్వ బడ్జెట్ విడుదల చేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బడ్జెట్ విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పి అరుణ్, ఉపాధ్యక్షురాలు ఎన్ శారద, అలీమ్, అంజలి, శంరమ్మ, నరేష్, రాకేశ్, శ్రీను, రవిప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 20: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆద్వర్యంలో కలెక్టరేట్ ఎదుట దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు పదివేల కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. స్కాలర్‌షిప్ భిక్ష కాదని, విద్యార్థుల హక్కు అని, వాటిని విడుదల చేయకుండా పేద విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నారని విమర్శించారు. ప్రైవేటు ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కరీంనగర్‌లో విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. అవి ఆత్మహత్యలు కాదని, ప్రభుత్వ హత్యలని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, రాష్ట్ర లా ఫోరం కన్వీనర్ నక్క ప్రమోద్, నితీష్, అనూష, మధు, బామండ్ల నందు, శ్రీవర్ధన్, నాగరాజు, అనూష, వంశీ, అరుణ్, సాయికృష్ణ, యోగేశ్, ప్రదీఫ్, అబ్దుల్ పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగట్టు



భక్తుల క్యూలైను

మల్యాల, ఫిబ్రవరి 20: కొండగట్టు ఆంజన్న క్షేత్రం మంగళవారం వేలాది భక్తులతో కిక్కిరిసింది. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. అంజన్న దర్శనం అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగింది.

ఎస్‌యూకు రూ.20 కోట్ల కేంద్ర నిధులు

- ఉప కులపతి ఎస్.మల్లేశ్



ప్రధాని వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వీసీ మల్లేశ్

గణేశ్‌నగర్, ఫిబ్రవరి20: శాతవాహన విశ్వ విద్యాలయానికి ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ పథకం కింద రూ.20 కోట్లు మంజూరయ్యాయని ఉప కులపతి ఎస్.మల్లేశ్ ప్రకటించారు. మార్చి 2022లో విశ్వవిద్యాలయానికి యూజీసీ 12(బి) హోదా సాధించామని తెలిపారు. మంజూరైన 20 కోట్ల నిధుల్లో 10 కోట్ల రూపాయలు భవనాలకు, 6 కోట్ల రూపాయలు నూతన ఆవిష్కరణలకు, 4కోట్లు సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి కోసం వినియోగిస్తామని వివరించారు. మంగళవారం ప్రధాని మోదీతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప కులపతి మల్లేశ్, రిజిస్రార్ ఆచార్య ఎం. వరప్రసాద్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయానికి నిధులు విడుదల చేసిన ప్రధానమంత్రి మోదీకి, రాష్ట్ర ప్రభుత్వానికి వీసీ కృతజ్ఞతలు తెలిపారు.

రెన్యూవల్ కాని ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 20: ప్రభుత్వ పరంగా రెన్యూవల్ కాని ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఫైర్ సేఫ్టీ, పార్కింగ్, పోల్యూషన్ అనుమతులు లేకుండా, స్థానికంగా డాక్టర్లు ఉండడం లేదని ఆరోపించారు. డాక్టర్లు లేకున్నా సూపర్ స్పెషాలిటీ, మల్టీ స్పెషాలిటీ పేర్లతో ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. కన్సల్టేషన్ వైద్యులతో పలు రకాల పరీక్షలు చేపిస్తూ, ఐసీయూ, జరరల్ రూములు, వెంటిలేటర్ చార్జీల పేరుతో లక్షలాది రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి, గతంలో అనుమతి తీసుకున్న ఆసుపత్రులు రినివల్ చేసుకోలేదని ఆరోపించారు. దీనిపై నిజనిర్ధారణ కమిటీ వేసి నిభందనలు పాటించని ఆసుపత్రులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నరేష్, ఉపాధ్యక్షుడు లక్పతి, నగర ప్రధానకార్యదర్శి రవీందర్‌నాయక్, ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 20: మండలంలోని కనుకులగిద్దె గ్రామానికి చెందిన గీత కార్మికుడు తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి గాయపడిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తాళ్లపల్లి అశోక్‌గౌడ్ తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో మోకు జారటంతో కిందపడ్డాడు. గమనించిన స్థానిక తోటి గీత కార్మికులు చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రాజేశం(ఫైల్)

ఎండపల్లి, ఫిబ్రవరి 20 : మండలంలోని సూరారం గ్రామానికి చెందిన చెల్పూరి రాజేశం(53) అనే రైతు విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందాడు. ధర్మపురి సీఐ, వెల్గటూర్ ఎస్ఐ కథనం ప్రకారం.. సూరారం గ్రామానికి చెందిన రాజేశం తన వ్యవ సాయ భూమిలో మక్క సాగు చేస్తున్నాడు. సోమవారం సాయంత్రం వరకు పొలంలోనే పనులు చేసుకున్నాడు. తిరిగి ఇంటికి వచ్చే సమయంలో మక్కకు నీరు పారేందుకు రాత్రి మోటర్ వేసి అడవి పందుల బెడద నుంచి మక్కను కాపాడుకునేందుకు పొలం చుట్టూ విద్యుత్ తీగలు అమర్చాడు. మంగళవారం ఉదయమే పొలం వద్దకు వెళ్లిన రాజేశం కాలుకు విద్యుత్ తీగ తగలడంతో షాక్ కొట్టి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సమయం దాటినా ఇంటికి రాకపోవడంతో అనుమానంతో రాజేశం కొడుకు పొలం వద్దకు వెళ్లి చూసే సరికి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గోడ దూకి పారిపోయిన గురుకుల విద్యార్థి

- క్షేమంగా ఇంటికి చేరిన విద్యార్థి

వెల్గటూర్, ఫిబ్రవరి 20: కోటిలింగాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నిర్వహిస్తున్న స్తంభంపల్లి మహాత్మ జ్యోతిబాపూలే బాలుర బీసీ గురుకుల పాఠశాల నుంచి ఓ విద్యార్థి మంగళవారం గోడ దూకి పారిపోవడం కలకలం రేపింది. పెగడపెల్లి మండలం నంచర్లకు చెందిన సాయిని జానకిరాం అనే 8వ తరగతి విద్యార్థి మధ్యాహ్న సమయంలో పాఠశాల ప్రహరీ దూకి పారిపోయాడు. హాజరు తీసుకునే సమయంలో విద్యార్థి లేకపోవడంతో గమనించిన పాఠశాల సిబ్బంది తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ప్రిన్సిపల్ రాజేశం, సిబ్బంది విద్యార్థి కోసం వెతకడం ప్రారంభించారు. పాఠశాల నుంచి తమ కొడుకు పారిపోవడం పట్ల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు మూడు గంటల తరువాత సదరు విద్యార్థి రాజారాంపల్లి బస్‌స్టాండ్‌లో ఉన్నాడనే సమాచారం తెలవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థి పారిపోవడంతో తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. చివరికి విద్యార్థి క్షేమంగా నంచర్లలోని తమ ఇంటికి చేరుకోవడంతో కథ సుఖాంతం అయింది. కాగా జాతరకు వెళ్లాలని విద్యార్థి పారిపోయినట్లు ప్రిన్సిపాల్ రాజేశం తెలిపారు. కానీ సహచర విద్యార్థులు దాడి చేయడంతో తట్టుకోలేక తమ కొడుకు పారిపోయి ఇంటికి వచ్చాడని విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. ఇలాంటిసంఘటనలు జరుగకుండా చూడాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

జన జాతరకు వేళాయె..

నేటి నుంచి మేడారం కుంభమేళా ప్రారంభం

▸ నేడు గద్దెకు చేరుకోనున్న సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు ▸ నాలుగు రోజుల పాటు పూజలందుకోనున్న వనదేవతలు



మేడారం జాతరకు తరలివస్తున్న భక్తులు

వరంగల్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడారం జనారణ్యం అవుతోంది. వనదేవతల ఆగమనానికి వేళవుతుండటంతో భక్తులతో మేడారం పోటెత్తుతోంది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అద్భుత క్షణాలు బుధవారం సాక్షాత్కరించనున్నాయి. తొలిరోజు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెకు చేరుకుంటారు. ఈ నేపథ్యంలో మేడారం జనగుడారమవుతోంది. ఎడ్లబండ్లు, కాలి నడకన, కార్లు, ఆటోలు, జీపులు, బస్సుల్లో భక్తులు మేడారం చేరుకుంటున్నారు.

నేటి నుంచి జాతర

తెలంగాణ కుంభమేళాగా పిలిచే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం నుంచి ప్రారంభం కానుంది. రెండేళ్లకోసారి మాఘశుద్ధ పౌర్ణమిన రోజైన బుధవారం నుంచి శనివారం వరకు నాలుగు రోజుల పాటు ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని దట్టమైన అరణ్యంలోని మేడారంలో జరిగే ఈ మహాజాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారు. పూర్తిగా ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో జరిగే ఈ జాతరలో ప్రకృతే దైవంగా.. వనదేవతల స్మారకార్థం నిర్మించిన కర్రల వద్దే పూజలు నిర్వహిస్తారు. వనదేవతలకు పసుపు, కుంకుమ, ఒడి బియ్యం, ఎదుర్కోళ్ల తో పాటు బంగారాన్ని (బెల్లం) మొక్కుగా చెల్లిస్తారు.

గద్దెపైకి చేరిన జంపన్న

జాతర నేపథ్యంలో సమ్మక్క తనయుడు జంపన్న కన్నెపల్లి నుంచి మంగళవారం రాత్రి 8గంటలకు జంపన్న వాగు ఒడ్డునున్న గద్దెకు చేరుకున్నారు. పోలెబోయిన వంశీయులు పూజారి సత్యం ఆధ్వర్యంలో పగిడె రూపంలో ఉన్న జంపన్నను గద్దెపై కొలువుదీర్చి పూజలు చేశారు.

నేడు గద్దెకు చేరనున్న సారలమ్మ

జాతర తొలిరోజున కన్నెపల్లి ఆడపడుచు సారలమ్మ గద్దెపైకి రానుంది. సారలమ్మ కొలువైన పల్లె కన్నెపల్లిలో బుధవారం ఉదయమే ప్రధాన పూజారి కాక సారయ్య ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సారయ్యతోపాటు మిగతా పూజారులు ఆలయాన్ని శుద్ధి చేసి అలికి ముగ్గులతో అలంకరిస్తారు. సాయంత్రం ఆలయంలో ఆదివాసీ పూజారులు రహస్య పూజలు జరుపుతారు. ఈ సమయంలోనే పూజారి సారయ్యను సారలమ్మ ఆవహిస్తుంది. సారయ్యకు పూనకం రావడంతో ఆలయం నుంచి గద్దెల వైపు పూజారులు సారలమ్మను తీసుకవస్తారు. కన్నెపల్లి మీదుగా తన తమ్ముడు జంపన్నను పలకరిస్తూ జంపన్నవాగును పూజారులు దాటుతారు. ఈ సమయంలోనే శివసత్తుల పూనకాలతో భక్తుల పుణ్యస్నానాలతో జంపన్నవాగు పులకరిస్తుంది. కన్నెపల్లి నుంచి మేడారంలో ఉన్న సమ్మక్క ఆలయానికి సారలమ్మ చేరుకుంటుంది.



సమ్మక్క గద్దె



సారలమ్మ గద్దె



కన్నెపల్లి నుంచి జంపన్నను గద్దెపైకి తీసుకొచ్చి ప్రతిష్ఠిస్తున్న వడ్డెలు



మేడారం దారిలో వాహనాల బారులు..



మంగపేట మండలం కమలాపురం నుంచి ఎడ్లబండ్లపై జాతర కొస్తున్న భక్తులు

పగిడిద్దరాజు, గోవిందరాజుల రాక

మంగళవారం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి సమ్మక్క భర్త పగిడిద్దరాజు మేడారం బయలుదేరారు. ఆదివాసీలు కాలినడకన పగిడిద్దరాజును పడిగె రూపంలో తీసుకుని బుధవారం సాయంత్రానికి మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకుంటారు. ఇక పగిడిద్దరాజు తమ్ముడు గోవిందరాజులు కూడా బుధవారమే ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి బయలుదేరి, మేడారం చేరుకుంటారు. సమ్మక్క ఆలయంలో ముగ్గురికి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం రాత్రి 8గంటలకల్లా మేడారంలోని గద్దెలపైకి చేరుకుంటారు. దీంతో తొలిరోజు జాతర అట్టహాసంగా ప్రారంభం అవుతుంది.

22న సమ్మక్క ఆగమనం

జాతరలో రెండోరోజైన గురువారం 22న మేడారంలోని చిలుకలగుట్టపై రహస్య ప్రాంతంలో సమ్మక్క ప్రధాన పూజారి కొక్కెర కిష్టయ్యతో పాటు వడ్డెలు మునిందర్, బొక్కయ్య ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్కను తీసుకుని ప్రధాన పూజారి కిష్టయ్య చిలుకలగుట్టపై నుంచి కిందకు వస్తున్న క్రమంలో ములుగు ఎస్పీ గాలిలోకి కాల్పులు జరిపి సమ్మక్క రాకను స్వాగతిస్తారు. ఆ సమయంలో కోట్లాది భక్తుల జయజయ నినాదాలతో మేడారం హోరెత్తుతుంది. సమ్మక్క ఆగమనంతో దారి పొడవునా వేలాది మేకలు, గొర్రెలు, కోళ్ల తలలు తెగి రక్తం చిందిస్తాయి. పూజారులు అత్యంత భక్తిశ్రద్ధలతో రాత్రి 10గంటల కల్లా సమ్మక్క గద్దెకు చేరుకోవటంతో మహాజాతర తుది ఘట్టానికి చేరుకుంటుంది.

23న మొక్కులు

జాతరలో మూడోరోజు శుక్రవారం గద్దెలపై సమ్మక్క, సారలమ్మల తోపాటు పగిడిద్దరాజు, గోవిందరాజులు చేరుకోవటంతో భక్తులు రాత్రి పగలు తేడా లేకుండా మొక్కులు చెల్లించేందుకు బారులు తీరుతారు. 23వ తేదీ శుక్రవారం వనదేవతలకు మొక్కులు చెల్లింపులు చేస్తారు. తీరొక్క మొక్కులతో వనదేవతలను శరణ కోరుతారు.

24న వనప్రవేశం

జాతరలో చివరి రోజైన నాలుగో రోజు శనివారం సాయంత్రం 6గంటలకు సమ్మక్క తిరిగి చిలుకలగుట్టకు తిరుగు ప్రయాణం అవుతుంది. సమ్మక్క వన ప్రవేశంతో సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు కూడా వారి స్వగ్రామాలకు పయనం అవుతారు. దీంతో జాతర ముగుస్తుంది.



వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



నేటి నుంచి సమ్మక్క-సారలమ్మ జాతర

హుజూరాబాద్, ఫిబ్రవరి 20: హుజూరాబాద్ పట్టణ శివారులోని రంగనాయకుల గుట్ట వద్ద బుధవారం నుంచి జరిగే శ్రీసమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లను అధికారులు మంగళవారం పరిశీలించారు. టౌన్ సీఐ బొల్లం రమేష్, తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, జాతర కమిటీ చైర్మన్ మూగల రాజిరెడ్డి పాల్గొన్నారు.

● మానకొండూర్ : మండలంలోని కొండపల్కల, దేవంపల్లి, వేగురుపల్లి, లింగాపూర్ గ్రామాలలో జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల సౌకర్యార్థం కోసం మంచినీరు, టెంటు, విద్యుత్, ఏర్పాట్లను చేశారు.

● ఇల్లందకుంట: మల్యాల శివారులో జరిగే శ్రీసమ్మక్క- సారలమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ గురుకుంట్ల రాజీరు పేర్కొన్నారు.

● రామడుగు: గుండి, తిర్మలాపూర్ గ్రామాల్లో నిర్వహించనున్న జాతర ఏర్పాట్లను తహశీల్దారు భాస్కర్, ఎంపీడీవో రాజేశ్వరి, ఎస్‌ఐ రమేష్, ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి, ఎంపిటిసిలు శ్యాంసుందర్, మోడీ, రవిందర్ దర్శించుకున్నారు.

● సైదాపూర్: సైదాపూర్-జాగీర్‌పల్లి గ్రామాల మధ్య ఊరగుట్టపై జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు గద్దెలు ముస్తాబయ్యాయి. జాతర ఏర్పాట్లను ఎంపీడీవో యాదగిరి మంగళవారం పరిశీలించారు.

ఏసీపీకి ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు

హుజూరాబాద్, ఫిబ్రవరి 20: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం కాంగ్రెస్ నాయకులు హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సుంకరి రమేష్, వెంకన్న, సలీం, రాకేష్, సంజు, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

వరి పంటలో జాగ్రత్తలు తీసుకోవాలి

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 20: వరి పంటలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని సిర్సపల్లి గ్రామంలోని రైతు వేదిక కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం వార్షిక మహాసభ సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ఏడీఏ సునీత, డీడీఏ చత్రునాయక్, మండల వ్యవసాయాదికారి సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు : కవ్వంపల్లి

మానకొండూర్, ఫిబ్రవరి 20 : విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం క్రీడా వార్షికోత్సవానికి హాజరై మాట్లాడారు. కళాశాల ప్రహరీ, అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నర్సయ్య, ప్రిన్సిపాల్ అంజనేయరావు, వివిధ గ్రామాల ఎంపీటీసీలు ఉన్నారు.

ఉద్యానవన పంటల సాగు లాభదాయకం : కలెక్టర్

గన్నేరువరం: ఉద్యానవన పంటల సాగు లాభదాయకంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి రైతులకు సూచించారు. మండలంలోని మాదాపూర్ గ్రామంలో ఉపాధిహామీ పథకం సహకారంతో రైతు కొళ్లెం గంగవ్వ, అంజిరెడ్డిలు సాగుచేసిన డ్రాగన్ ఫ్రూట్ తోటను, జంగపల్లిలో కర్ర అనూష, శ్రీకాంత్ దంపతులు సాగుచేసిన గులాబీ, చామంతి పూల తోటలను పరిశీలించారు.

మేడారం జాతరపై విద్యార్థుల సమావేశం

చొప్పదండి: మండలంలోని రెవెల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మేడారం జాతరపై విద్యార్థులు నమూనా జడ్పీ సమావేశం నిర్వహించారు విద్యార్థులే అధికారులు, ప్రజాప్రతినిధులుగా వ్యవహరించారు.

అండర్ బ్రిడ్జి నిర్మించాలని ఎంపీకి వినతి

శంకరపట్నం: తాడికల్-చింతగుట్ట గ్రామాల మధ్య నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణంలో అండర్ బ్రిడ్జి నిర్మించాలని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్‌కు మంగళవారం చింతగుట్ట గ్రామ అంబేద్కర్ యువజన సంఘం నాయకులకు వినతిపత్రం అందజేశారు.

పేద మహిళలకు ఆదాయ వనరులు కల్పించాలి


సైదాపూర్: మండలంలో పేద మహిళలను గుర్తించి వారికి ఆదయ వనరులు కల్పించి వారిని లక్షపతి దీదీలుగా తయారు చేయాలని అదనపు డీఆర్డీవో సునీత అన్నారు. మంగళవారం సైదాపూర్‌లోని స్త్రీ శక్తి భవనంలోని సంతోషిమాత మండల సమాఖ్య కార్యాలయంలో సెర్ప్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్థులు

వీణవంక: మండలంలోని ఘన్ముక్ల గ్రామంలో తూర్పుకుంట నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్న రోడ్డు కాంట్రాక్టర్‌ను గ్రామస్థులు, మాజీ ప్రజాప్రతినిధులు మంగళవారం అడ్డుకున్నారు.

ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20: కరీంనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం స్థానిక 25వ డివిజన్ శివాజీనగర్‌లో నగరపాలక సంస్థ సాధారణ నిధులు రూ.7.50 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ సహకారంతో వందల కోట్ల రూపాయలను తీసుకొచ్చి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దామని చెప్పారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియగా నగరపాలక సంస్థతో కలిసి చేపడుతున్నామని అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పించడంతో పాటు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎడ్ల సరిత అశోక్, పలువురు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

●అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం

ఆదర్శనగర్‌లో అగ్ని ప్రమాదం సంభవించి 21 గుడిసెలు పూర్తిగా దగ్ధం కావడం బాధాకరమని మేయర్ సునీల్‌రావు విచారం వ్యక్తం చేశారు. గుడిసెలు దగ్ధమైన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అగ్ని ప్రమాదం జరిగినట్లు సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వడంతో పాటు నగరపాలక సంస్థ నుంచి వాటర్ ట్యాంకర్లను పంపించి మంటలు ఆర్పించామన్నారు. సంఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి పరిశీలించారు. అగ్నిప్రమాదంపై స్థానికుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నామని చెప్పారు.

'ఉత్తర తెలంగాణ ప్రజలను మోసం చేసిన కేసీఆర్'

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 20: ఉత్తర తెలంగాణ ప్రజలను, దళితులను మాజీ సీఎం కేసీఆర్ మోసం చేయడమే కాకుండా బద్నాం చేశారని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం ప్రజామిత్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తరువాత ఉత్తర తెలంగాణకు కొత్తగా ఏం తెచ్చారని ప్రశ్నించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల డ్యామ్‌లు నిర్మాణం అనేది పెద్ద మోసం అని అన్నారు. వాటి వల్ల డబ్బులు వృథా అయ్యాయని అన్నారు. కేసీఆర్, హరీష్‌రావులకు దమ్ముంటే కాళేశ్వరం ప్రాజెక్టుపై చర్చకు రావాలని, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్లు బిక్షం, లక్ష్మీనారాయణ, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఉత్తర తెలంగాణలోని జిల్లాలను ముక్కలుగా చేసి కేసీఆర్ ఇక్కడి నాయకత్వంలో చైతన్యం లేకుండా చేశారని ఆయన ఆరోపించారు.

ఒలింపియాడ్‌లో అచీవర్స్ విద్యార్థుల ప్రతిభ

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 20: హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో మంగళవారం జరిగిన ఎస్.ఆర్.ఎఫ్. ఒలింపియాడ్‌లో ఎం.నిషిత ఏడో తరగతి రాష్ట్రస్థాయి ర్యాంకు, టీ.మహాశ్రీ తొమ్మిదో తరగతి, బి.ద్వారకసాయి శివ తరగతి, జి.సిద్దేశ్వర్ రెడ్డి ఐదవ తరగతి, టి.సహశ్రీ ఆరవ తరగతి, లక్ష్మీ సంయుక్త మూడో తరగతి జిల్లాస్థాయిలో అత్యంత ప్రతిభ కనబరిచి అవార్డులు సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ చేతుల మీదుగా అవార్డులు స్వీకరించారు. అనంతరం విద్యార్థులను జయప్రకాశ్ నారాయణ, పాఠశాల డైరెక్టర్ సి.హెచ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి అభినందించారు.

మంత్రిని కలిసిన ఆర్టీసీ అధికారులు

భగత్‌నగర్, ఫిబ్రవరి 20: మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆర్టీసీ ఈడీ మునిశేఖర్, ఆర్ఎం సుచరిత మంగళవారం ఆయన నివాసంలో కలిశారు. మేడారం జాతరకు ఆర్టీసీ ఏర్పాట్ల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ భూపతిరెడ్డి పాల్గొన్నారు.

ప్రమాద బాధితులను ఆదుకోవాలి

భగత్‌నగర్; ఫిబ్రవరి 20: గ్యాస్ సిలిండర్ ప్రమాదం బాధిత గుడిసె వాసులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు డిమాండ్ చేశారు. నగరంలోని ఆదర్శనగర్‌లో గ్యాస్ సిలిండర్ పేలి దగ్ధమైన గుడిసెవాసులను ఆదుకోవాలన్నారు. ప్రతి కుటుంబానికి రెండు లక్షల నష్ట పరిహారం అందించాలన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసర సరుకులు అందించిన ఎంపీ

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి20: కరీంనగర్ ఆదర్శనగర్‌లో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన పూరిగుడిసె బాధితులకు ఎంపీ బండి సంజయ్‌కుమార్ నిత్యావసర సరుకులు అందించారు. నిరుపేద కూలీల 30 కుటుంబాల కోసం బీజేపీ శ్రేణుల ద్వారా అవసరమైన నిత్యావసర వస్తువులు, వంట పాత్రలు, ఇతర సామగ్రిని మంగళవారం రాత్రి అందించారు. బాధితులకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో భోజన సదుపాయం అందించాలని ఎంపీ సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాస సత్యనారాయణరావు, దుబ్బల శ్రీనివాస్, గుగ్గిళ్ల రమేష్, రాపర్తి ప్రసాద్, కటకం లోకేష్, దురిశెట్టి సంపత్, ఎండీ ముజీబ్, ఉప్పరపల్లి శ్రీనివస్, ప్రసన్న అవుదుర్తి శ్రీనివాస్, శివ రాజ్, బషీర్, కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్, బండ రమణారెడ్డి, రాపర్తి విజయ, పెద్దపల్లి జితేందర్, నాగసముద్రాల ప్రవీణ్, మునిగంటి కుమార్ పాల్గొన్నారు.



నిత్యావసర వస్తువులను అందజేస్తున్న బీజేపీ నాయకులు

టీచర్స్, లెక్చరర్స్ ఫోరం ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 20: తెలంగాణ టీచర్స్, అండ్ లెక్చరర్స్ ఫోరం ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు మాసం రత్నాకర్ పిలుపు నిచ్చారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ఫిల్మ్‌భవన్‌లో ఈనెల 23న ఆవిర్భావ సభను నిర్వహిస్తున్నామని ఆయన ఈసందర్భంగా తెలిపారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రాష్ట్ర కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ప్రతినిధులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 20: నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం జ్ఞానేశ్వర్, కె గంగాధర్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జిల్లా శాఖ కార్యవర్గ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ తమకు రావలసిన మూడు డీఏలు, పీఆర్‌ఎస్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, ప్రధాన కార్యదర్శి దూల్గుంటి నరసింహారెడ్డి మాట్లాడుతూ నాల్గవ తరగతి ఉద్యోగులకు నివేషన స్థలాల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని రాష్ట్ర నాయకత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ధనరాజ్, జిల్లా సహా అధ్యక్షుడు సోమయ్య, నగరశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి శంకరయ్య, మహిళ ఉపాధ్యక్షురాలు దేవేంద్ర, సంయుక్త కార్యదర్శి అనిత, లక్ష్మీ పాల్గొన్నారు.

'గుడిసెల దగ్ధంపై విచారణ జరిపించాలి'

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20: నగరంలోని ఆదర్శనగర్‌లో 30 గుడిసెలు దగ్ధం కావడంలో అనేక అనుమానాలున్నాయని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధిత నిరుపేద కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన గుడిసెలు దగ్ధమైన ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆ ప్రాంతం భూవివాదంలో ఉందని, అలాంటప్పుడు గుడిసెలకు కిరాయి ఎవరు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. వివాదాస్పద స్థలానికి కరెంటు, నీళ్ళు, ఏ విధంగా సరఫరా అవుతున్నాయని, అక్రమంగా వాటిని వాడుతున్నారా అనే విషయాలను అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేదలు మేడారం జాతరకు వెళ్ళిన సమయం చూసి భూకబ్జా దారులు ఇలాంటి చర్య లకు పాల్పడ్డారనే ఆరోపణలు కూడా వినిపిస్తు న్నాయన్నారు.

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా అచ్చేశ్వర్‌రావు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 20 : కరీంనగర్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారిగా అచ్చేశ్వర్‌రావు నియామకమయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన రమణారెడ్డి హైదరాబాద్ నార్కోటిక్స్ బ్యూరోకు బదిలీ కాగా ఆయన స్థానంలో ఆసిఫాబాద్ అడిషనల్ ఎస్పీగా పని చేసిన అచ్చేశ్వర్‌రావును నియామకం చేశారు.

మానసిక వికలాంగుల పాఠశాలకు బస్సు వితరణ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20: జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు ఆధ్వర్యంలోని మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలకు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా బస్సును కొనుగోలు చేసేందుకు రూ.25లక్షలు సమకూర్చినట్లు ట్రస్టు సభ్యుడు సముద్రాల జనార్ధన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

పారమిత విద్యార్థులకు రాష్ట్రస్థాయి అవార్డులు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20: శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రామానుజన్ గణిత ఒలింపియాడ్‌లో పారమిత ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు రితేష్ మెహతా ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాశ్‌నారయణ్ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి అవార్డులను చవట లక్ష్మీహాసిని మొదటి ర్యాంకు, పబ్బతి విద్వాన్ రెండవ ర్యాంకు, చవట వెంకట మోక్షిత్ నాల్గవ ర్యాంకు, ఆరుగురు విద్యార్థులు జె.శ్రేష్ఠ, జి.సంతోష్, సిహెచ్.శ్రీకాంత్, కె.ఆగస్త్య ఎస్.రూపనిగమ, ఎం.సిరిశాంభవి జిల్లా స్థాయి ర్యాంకులను సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను పారమిత అధినేత డాక్టర్.ఇ.ప్రసాదరావు అభినందించారు.

'ఎంపీ సంజయ్‌పై అనవసర ఆరోపణలు'

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20: కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పసలేని సవాళ్ళు విసురుతూ ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ ఒక ప్రకటనలో ఖండించారు.

ఎన్నిక

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 20: రాజా బహద్దూర్ వెంకటరామారెడ్డి విజ్ఞాన పరిషత్(ఆర్‌బీవీఆర్‌ఆర్, రెడ్డి సంక్షేమ సంఘం) ఉమ్మడి జిల్లా న్యాయ సలహాదారునిగా కరీంనగర్ జిల్లా కోర్టు న్యాయవాది బేతి మహేందర్‌రెడ్డిని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.